# మొక్కజొన్న, ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి!

- జన్నారం తహసిల్దార్‌కు రోటిగూడ రైతుల వినతి
- కొనుగోలు కేంద్రాలు లేక దళారీల చేతిలో దోపిడీ
- అకాల వర్షాలతో తడిసి ముద్దవుతున్న పంటలు



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రోటిగూడ గ్రామ రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జన్నారం తహసిల్దార్ బక్కయ్యను కలిసి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. జన్నారం మండలం పరిధిలోని రోటిగూడ, కవ్వాల్, జన్నారం, కామన్ పల్లి, ఇంధన్ పెల్లి తదితర గ్రామాల్లో తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని వారు కోరారు.

### దళారీల చేతిలో మోసపోతున్న రైతాంగం

ఈ సందర్భంగా రోటిగూడ గ్రామ సర్పంచ్ జిల్లపెల్లి గోపాల్ మాట్లాడుతూ.. ఈ ఏడాది రైతులు ఎంతో కష్టపడి మొక్కజొన్న పంటను విస్తారంగా పండించారని తెలిపారు. అయితే ప్రభుత్వం అధికారిక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో, పంటను అమ్ముకునేందుకు మార్కెట్‌కు వెళ్లిన రైతులు దళారీల చేతిలో దారుణంగా మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దతు ధర దక్కక, తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని మండిపడ్డారు.

### అకాల వర్షాలతో కన్నీరు మున్నీరు

మరోవైపు వరుసగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయని సర్పంచ్ పేర్కొన్నారు. కళ్లాల్లో ఉన్న పంటలు, రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్నలు వర్షానికి తడిసి ముద్దవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోయారు. తడిసిన ధాన్యాన్ని, మొక్కజొన్నను చూసి రైతులు కన్నీరు మున్నీరవుతున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి యుద్ధప్రాతిపదికన కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు.

### నిర్లక్ష్యం వహిస్తే పోరాటం తప్పదు!

రైతుల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్య వైఖరిని వీడాలని.. లేనిపక్షంలో మండలంలోని రైతులందరినీ ఏకం చేసి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జిల్లపెల్లి గోపాల్‌తో పాటు బీజేపీ జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, గ్రామ పెద్దలు, యువకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.





# సాంస్కృతిక పోటీల్లో అక్కపల్లిగూడెం జోరు!

- కోలాటంలో ప్రథమ, లంబాడిలో ద్వితీయ స్థానం
- విజేతలకు విద్యాధికారి యాదయ్య బహుమతుల ప్రదానం
- విజయం సాధించిన విద్యార్థులపై ప్రశంసల జల్లు

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

మంచిర్యాల జిల్లాలో ఘనంగా జరుగుతున్న విద్యా వారోత్సవాల సందర్భంగా శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలలో జన్నారం మండలం, అక్కపల్లిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పాఠశాలల మధ్య హోరాహోరీగా సాగిన ఈ పోటీలలో అక్కపల్లిగూడెం విద్యార్థులు తమ ప్రతిభతో అందరినీ మంత్రముగ్ధులను చేశారు. తెలంగాణ జానపద కళలైన కోలాటం, లంబాడి నృత్యాలలో విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచారు. కోలాటంలో జిల్లా స్థాయి ప్రథమ స్థానం, లంబాడి నృత్యంలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని పాఠశాల కీర్తిని దశదిశలా చాటారు.

### బహుమతుల ప్రదానం

పోటీలలో విజేతలుగా నిలిచిన అక్కపల్లిగూడెం పాఠశాల విద్యార్థులు అజ్మీర కీర్తన, ముద్రకోల శివాని, దారాజుల శ్రావణిలకు జిల్లా విద్యాధికారి యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో అద్భుతమైన ప్రతిభ దాగి ఉందనడానికి ఈ విద్యార్థుల ప్రదర్శనే నిదర్శనమని కొనియాడారు. చదువుతో పాటు ఇలాంటి సాంస్కృతిక రంగాలలో కూడా విద్యార్థులు రాణించడం అభినందనీయమన్నారు.

### అధికారుల ప్రశంసలు

జిల్లా స్థాయిలో ఘన విజయం సాధించి, మండలానికి మంచి పేరు తెచ్చిన విద్యార్థులను జన్నారం మండల విద్యాధికారి నడిమెట్ల విజయకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను జిల్లా స్థాయిలో విజేతలుగా నిలబెట్టడానికి అహర్నిశలు శ్రమించి, వారికి చక్కని నృత్య శిక్షణ ఇచ్చిన డాన్స్ మాస్టర్ వంశీని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్ ని గ్రామస్తులు, అధికారులు కొనియాడారు. నిరంతరం ప్రోత్సహించిన ఉపాధ్యాయ బృందం శెట్టి రాజశేఖర్, కరుణలను, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ రమాదేవిని విద్యాశాఖ అధికారులు ఘనంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు జిల్లా స్థాయిలో ఇలాంటి ప్రతిభ కనబరచడం పట్ల అక్కపల్లిగూడెం గ్రామ ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎండలు మండుతున్నాయి.. ప్రజలు జాగ్రత్త!

**మంచిర్యాల జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ అనిత సూచన**

**మధ్యాహ్నం వేళ ఇళ్ల నుంచి బయటకు రావద్దు**

**ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం**

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

మంచిర్యాల జిల్లాలో రోజురోజుకూ భానుడి భగభగలు హెచ్చుమీరుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా జిల్లా ప్రజలంతా తీవ్ర అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డీఎంహెచ్ఓ డాక్టర్ అనిత ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర ఆరోగ్య పరిస్థితుల్లో 108 ఉచిత అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత అత్యధికంగా ఉంటుందని, కాబట్టి ఆ సమయంలో ప్రజలు ఎవరూ అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రాకూడదని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను విరివిగా అందుబాటులో ఉంచామని తెలిపారు. నీరసంగా అనిపించినా, డీహైడ్రేషన్‌కు గురైనా వెంటనే వీటిని ఉపయోగించాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా తీవ్రమైన వేడి కారణంగా వడదెబ్బ బారిన పడి స్పృహ కోల్పోతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వారిని నీడకు చేర్చి, శరీరాన్ని తడి బట్టతో తుడవాలని డీఎంహెచ్ఓ అనిత సూచించారు. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత త్వరగా అదుపులోకి వస్తుందని పేర్కొన్నారు. ఎండలో వెళ్లేవారు తప్పనిసరిగా గొడుగు, టోపీ ధరించాలని, వెంట నీళ్ల బాటిల్ ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఓఆర్ఎస్ ద్రావణంతో పాటు మజ్జిగ, కొబ్బరి నీళ్లు లాంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా డీహైడ్రేషన్ బారిన పడకుండా మిమ్మల్ని మీరు కాపాడుకోవచ్చని ఆమె తెలిపారు.



# ఇంధన ధరల పెంపుపై సిపిఐ ఆగ్రహం!

**బెజ్జంకిలో ఆటోను తాళ్లతో లాగి వినూత్న నిరసన**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల భారంపై మండిపాటు**

**సామాన్యుల జేబులకు చిల్లులు పడుతున్నాయని ఆవేదన**

**బెజ్జంకి, మే 16 (జనం పవర్):** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచడాన్ని నిరసిస్తూ శనివారం సిపిఐ ఆధ్వర్యంలో బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆటోను తాళ్లతో లాగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ మాట్లాడుతూ.. కార్పొరేట్ వ్యాపారస్తులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తోందని, వారి కనుసన్నల్లోనే నడుస్తోందని ఆరోపించారు. చమురు ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, యుద్ధాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు కొరత ఏర్పడుతోందని రూపేష్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితులు వచ్చినప్పుడల్లా ధరలు పెంచి సామాన్య ప్రజల జేబులకు చిల్లులు పొడుస్తున్నారని మండిపారు. భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ పై భారీగా పన్నులు వసూలు చేస్తూ ప్రజలపై మరింత భారం మోపుతున్నాయని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు బోనగిరి మహేందర్, నాయకులు సంగేమ్ మధు, కల్లూరి బాలమల్లు, బోనగిరి శ్రావణ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతర వేణి మహేష్ యాదవ్, సమ్మయ్య, కర్రావుల నరసయ్య, గంగుల బాలయ్య పాల్గొన్నారు.



# బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన!

**కామారెడ్డి మహిళా సమాఖ్య భవన్‌లో సదస్సు**

**మానవ అక్రమ రవాణాపై కూడా చైతన్యం**

**పాటలు, మాటల ద్వారా వివరించిన పోలీస్ కళాబృందం**




**జుక్కల్, మే 16 (జనం పవర్):** జిల్లా సెషన్స్ జడ్జి వరప్రసాద్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ జడ్జి నాగరాణి ఆధ్వర్యంలో కామారెడ్డిలోని మహిళా సమాఖ్య భవన్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో.. 'మహిళలు – పిల్లల సంరక్షణ: సామాజిక బాధ్యత', 'బాల్య వివాహాల నిర్మూలన', 'మానవ అక్రమ రవాణా' వంటి కీలక అంశాలపై ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో కామారెడ్డి జిల్లా ఏపీఎం శ్రీనివాస్, ఐకేపీ మహిళలతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళా సంఘాల అధ్యక్షులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు పోలీస్ కళాబృందం సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రదర్శనల ద్వారా చైతన్యం కల్పించారు. కళాబృందం ఇన్‌ఛార్జి, హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ యు.శేషారావు, పీసీలు ప్రభాకర్, సాయిలు పాటలు, మాటల ద్వారా బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా వల్ల కలిగే అనర్థాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రామన్, ఏహెచ్‌టీయూ పీసీ రాజేందర్, కామారెడ్డి షీ టీమ్ సభ్యులు డబ్ల్యూపీసీ సౌజన్య, పీసీ భూమయ్య, డీఎల్ఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాల్లో చిత్రకళా ప్రదర్శన!

**ప్రతిభ చాటిన ఉపాధ్యాయులకు సత్కారం..**

**ప్రశంసా పత్రాలు అందజేసిన డీఈఓ రాజు**



**జుక్కల్, మే 16 (జనం పవర్):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో శనివారం 'ప్రజా పాలన – ప్రగతి పాలన' విద్యా వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రకళా ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు ఆర్ట్, క్రాఫ్ట్ ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి రాజు ప్రశంసా పత్రాలను అందజేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో బిచ్కుంద కస్తూరిబా గాంధీ పాఠశాల క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు గంగామణి, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఆర్ట్ ఉపాధ్యాయులు రాజ్ కుమార్, మద్నూర్ బాలుర పాఠశాల ఆర్ట్ ఉపాధ్యాయుడు, పిట్లం కస్తూరిబా పాఠశాల క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు శ్రీలత ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎల్లయ్యతో పాటు ఇతర విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలి!

**మంచిర్యాలలో ఘనంగా విద్యా వారోత్సవాలు**

**కళలు, క్రీడలతోనే క్రమశిక్షణ: కలెక్టర్ కుమార్ దీపక్**

**గెలుపోటముల కంటే ప్రయత్నమే ముఖ్యం**



**నగేష్-జనం పవర్-ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో ఏర్పాటు చేసిన కళలు, హస్తకళలు, సాంస్కృతిక దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ వారోత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. కోలాటం, తోలుబొమ్మలాట, బొమ్మల ప్రదర్శన, పేరిణి శివతాండవం, ఒగ్గు కథ, లంబాడి, ఆదివాసి నృత్యం, చిత్రలేఖనం, హస్తకళలు వంటి విభిన్న అంశాలలో విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని, కళలతో పాటు క్రీడారంగంలోనూ రాణించాలని సూచించారు.

వివిధ రంగాలలో నైపుణ్యం సాధించడం ద్వారా విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే జట్టుగా పనిచేసే విధానంపై మంచి అవగాహన కలుగుతుందన్నారు. ఏ రంగంలోనైనా గెలుపు, ఓటములు ముఖ్యం కాదని, శ్రమించి ప్రయత్నించడమే మొదటి విజయమని స్పష్టం చేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నామని, వాటి ద్వారా వివిధ అంశాలలో విద్యార్థులకు చక్కని శిక్షణ అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పదో తరగతి టాపర్లకు ఘన సన్మానం!

**తాళ్లపేటలో ప్రతిభ చాటిన విద్యార్థులు**

**శాలువాలతో సత్కరించిన సర్పంచ్ కళావతి**

**ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్ష**



**దండేపల్లి, ఏప్రిల్ 16 (జనం పవర్):** దండేపల్లి మండలంలోని తాళ్లపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను తాళ్లపేట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండలంలో మూడో టాపర్‌గా నిలిచిన దర్శనాల జస్వంత్ (547 మార్కులు), ఎండీ అంజుమ్ (522 మార్కులు), అడె మహిత (519 మార్కులు)లను సర్పంచ్ కుర్సెంగ కళావతి ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి మాట్లాడుతూ.. విద్యార్థులు రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్, పంచాయతీ కార్యదర్శి సత్తయ్య, ఏఎన్ఎం రాధిక, వార్డు సభ్యులు కుడిమేత సుంగు, ఆత్రం భీంరావు, సోయం లచ్చుబాయి, నాయకులు మాడ దయాకర్, యూసుఫ్, మోటపల్కుల సురేష్, జహీర్ పాల్గొన్నారు.

# విద్యారంగానికి కాంగ్రెస్ పెద్దపీట

**టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

**సంగారెడ్డి ప్రభుత్వ కళాశాలలో విద్యా వారోత్సవాలు**

**ఆన్‌లైన్ తరగతుల మానిటర్లు ప్రారంభం**

**విద్యార్థినులు అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపు**



**సంగారెడ్డి, మే 16 (జనం పవర్):** కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన విద్యా వారోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాలలో ఆన్‌లైన్ తరగతుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మానిటర్లను నిర్మలా జగ్గారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థినులు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. భవిష్యత్తుపై స్పష్టమైన దృష్టితో ఇప్పటి నుంచే కష్టపడి చదవాలని సూచించారు. ఈ విద్యా వారోత్సవాల కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కళాశాల ప్రిన్సిపాల్ సునీత, లెక్చరర్ శ్రీనివాస్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# డెంగ్యూ రహిత సమాజమే లక్ష్యం!

**సిద్దిపేటలో జాతీయ డెంగ్యూ దినోత్సవ సదస్సు**

**దోమల నిర్మూలనతోనే వ్యాధులకు అడ్డుకట్ట**

**అవగాహన ర్యాలీని ప్రారంభించిన వైద్య అధికారులు**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంవత్సరం 'యునైటెడ్.. యాక్ట్.. ఎలిమినేట్' అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సిహెచ్ ధనరాజ్ మాట్లాడుతూ.. డెంగ్యూ వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. దోమలు వృద్ధి చెందే నీటి నిల్వలను ముందుగానే గుర్తించి లార్వా దశలోనే నిర్మూలిస్తే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ప్రజలు తమ ఇళ్ల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని, నీటి ట్యాంకులు, డబ్బాలను మూతలతో మూసి ఉంచాలని డీఎంహెచ్ఓ సూచించారు. రాత్రి సమయంలో దోమతెరలు వినియోగించడంతో పాటు దోమల నివారణ మందులు, మస్కిటో బ్యాట్‌లను ఉపయోగించాలని తెలిపారు. జ్వరం, చలి, వణుకు, ఒళ్లు నొప్పులు, వాంతులు, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. డెంగ్యూ రహిత భారత్ కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీకాంత్ యాదవ్ బస్తీ దవాఖాన ప్రాంతంలో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు పాటిద్దాం అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి నవీన్ రాజ్ కుమార్, ఎంటమాలజిస్ట్ సోఫాన్, ఆరోగ్య విస్తరణ అధికారి కాల్వ చక్రధర్, ల్యాబ్ టెక్నీషియన్లు కోటేశ్వరరావు, ఆంజనేయులు, శ్రీనివాస్, సంతోష్ రెడ్డి, బిక్షపతి, ఫైలేరియా సిబ్బంది ఫరీద్, ప్రభు, బాలమణి, స్వామి, నవీన్, నాసర్పుర, అంబేద్కర్ నగర్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల కొరకే కాంగ్రెస్ ప్రభుత్వం

- జుక్కల్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ప్రత్యేక ప్రాధాన్యం
- రాజకీయాల కంటే ప్రజా సంక్షేమమే ముఖ్యం
- పేదల సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యం
- ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావ్!



**జుక్కల్, మే 16 (జనం పవర్):** పేదల పట్ల అంకితభావం, పరిపాలనలో పారదర్శకత, రాజకీయాల్లో నిష్పక్షపాత ధోరణి కలిగిన వ్యక్తే నిజమైన ప్రజానాయకుడని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావ్ నిరూపిస్తున్నారు. సొంత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, ప్రజల సమస్యల విషయంలో ఎలాంటి మొహమాటం లేకుండా నిలబడి మాట్లాడటం ఆయన ప్రత్యేకత. పదవుల కంటే ప్రజల ప్రయోజనాలే ముఖ్యమనే సిద్ధాంతంతో ఆయన నియోజకవర్గంలో ముందుకు సాగుతున్నారు.

**ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో వెలుగు**

జుక్కల్ నియోజకవర్గంలో పేద కుటుంబాల జీవితాల్లో వెలుగు నింపేందుకు "ఇందిరమ్మ ఇళ్లు" నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్యేక కట్టుబాటుతో పని చేస్తున్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే కలను నిజం చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా అద్దె ఇళ్లలో కష్టాలు పడుతున్న పేదలకు ఈ పథకం ద్వారా భద్రత, గౌరవం, భవిష్యత్తుపై నమ్మకం లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.

**ప్రజల పక్షాన నిరంతర గళం**

ప్రభుత్వ పథకాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా నిజమైన అర్హుల వద్దకు చేరాలనే చిత్తశుద్ధితో ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావ్ పనిచేస్తున్నారు. పేదవాడి ఇంట్లో వెలుగు నింపడం, రైతుల కష్టానికి తగిన గిట్టుబాటు ధర అందించడం, యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించడం లాంటి ప్రధాన సమస్యలపై అధికారంలో ఉన్నామనే కారణంతో మౌనం వహించకుండా ప్రజల తరఫున ఆయన గళమెత్తుతున్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా, నిరంతరం ప్రజల బాధలను తన బాధలుగా భావించి పోరాడుతున్నారు. అధికారానికి వెరవకుండా నిజం మాట్లాడే ధైర్యం ఆయనలో స్పష్టంగా కనిపిస్తోందని నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న ఆయన నాయకత్వం జుక్కల్ ప్రజలకు ఆశాకిరణంగా మారింది.

# బెజ్జంకి మండలంలో దొంగల బీభత్సం!

- ఆరుబయట నిద్రిస్తున్న మహిళలే లక్ష్యంగా చోరీలు
- ఇద్దరి మెడల్లోంచి ఆరు తులాల పుస్తెలతాళ్ల అపహరణ
- నిందితుల వేట కోసం రెండు పోలీసు బృందాల ఏర్పాటు



**బెజ్జంకి, మే 16 (జనం పవర్):** బెజ్జంకి మండలంలోని చిలాపూర్, రేగులపల్లి గ్రామాలలో శుక్రవారం రాత్రి తీవ్ర కలకలం రేగింది. ఆరుబయట నిద్రిస్తున్న మహిళల మెడల నుంచి పుస్తెలతాళ్లను దొంగలు అపహరించారు. బెజ్జంకి ఎస్ఐ తోట తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. చిలాపూర్ గ్రామానికి చెందిన కొత్త తారవ్వ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి బయట నిద్రిస్తోంది. ఆ సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలోని బంగారు తాడును లాగేందుకు ప్రయత్నించారు. తారవ్వ వెంటనే తేరుకుని కేకలు వేయడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు.

**లక్ష్మి, లాస్య మెడల్లోంచి తాళ్ల చోరీ**


అదే గ్రామానికి చెందిన తడిమేలపల్లి లక్ష్మి అలియాస్ నీసాని మణెమ్మ ఇంటి ముందర నిద్రిస్తున్న సమయంలో దుండగులు ఆమె మెడలోని సుమారు మూడు తులాల బంగారు పుస్తెలతాడును గుంజుకుని పరారయ్యారు. ఈ ఘటనలో మణెమ్మకు స్వల్ప గాయమైంది. ఇద్దరు వ్యక్తులు పరిగెత్తుకుంటూ వెళ్లడం స్థానికులు గమనించారు. మరో ఘటనలో రేగులపల్లి గ్రామానికి చెందిన భూపతి లాస్య అనే మహిళ ఇంటి బయట నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని సుమారు మూడు తులాల బంగారు పుస్తెలతాడును లాగుకుని పారిపోయాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే వెతికినప్పటికీ దొంగల ఆచూకీ లభించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ తోట తిరుపతి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**నిందితుల కోసం గాలింపు చర్యలు**

మహిళల మెడల్లోంచి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటనపై రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తోట తిరుపతి చెప్పారు. నిందితులను త్వరలోనే గుర్తించి అదుపులోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. మండలంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు గానీ, వంద నంబర్ కు గానీ సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# దుబాయ్‌లో జగిత్యాల కార్మికుడి నిర్బంధం!

- సీఎం ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించిన భార్య
- జీతం ఇవ్వకుండా కంపెనీ వేధింపులని ఆవేదన
- భర్తను సురక్షితంగా రప్పించాలని వేడుకోలు



Sri. Sheshadri IAS garu
Principal secretary to Hon'ble CM
Sir, He is in Jail in Dubai Speak to the concerned for my release
G. Chinna Reddy
15.05.2026

Date: 15.05.2026

Dr. G. CHINNA REDDY

To

Sri. Anumula Revanth Reddy Garu
Hon'ble Chief Minister of Telangana, Hyderabad

Copy to:
Sri. Adluri Lakshman Kumar Garu, MLA, Dharmapuri & Minister

Subject: CM Pravasi Prajavani – Request for Legal Aid, Release, and Repatriation of Mr. Katu Thirupathi who is detained by Dubai Police.

Respected Sir,

I respectfully submit this representation seeking your kind intervention for providing legal assistance, securing the release, and facilitating the repatriation of my husband, Mr. Katu Thirupathi, from Dubai, UAE to Hyderabad, India. At present, he is reportedly under the custody of Dubai Police.

As per the records, his permanent address in India is as follows:

Mr. Katu Thirupathi, S/o. Mr. Katu Rayamallu, H. No. 2-2, Village: Cherlapalli, Mandal: Endapalli, Dist: Jagtial, Telangana State. Pin Code: 505 526

His present residential address is as follows:

Mr. Katu Thirupathi, S/o. Mr. Katu Rayamallu, H. No. 2-44, Village: Rajaram, Mandal: Dharmapuri, Dist: Jagtial, Telangana State. Pin Code: 505 425

C.M. PRAJAVANI P-15
Date: 15/05/26
MAHATMA JYOTHIBA PHULE PRAJA BHAVAN
REF ID: [illegible]



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లిన ఒక తెలంగాణ కార్మికుడు అక్కడ తీవ్ర ఇబ్బందుల్లో పడ్డాడు. జగిత్యాల జిల్లా ఎండపెల్లి మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన కట్టు తిరుపతిని దుబాయ్ ఎయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ అధికారులు నిలిపివేసి, స్థానిక పోలీసులకు అప్పగించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడిని రక్షించి స్వదేశానికి రప్పించాలని కోరుతూ అతని భార్య రజిత హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించారు. జీవనోపాధి కోసం ఈ ఏడాది జనవరి 10న తిరుపతి దుబాయ్ వెళ్లారు. అక్కడ చేరినప్పటి నుంచి యాజమాన్యం అతనికి జీతం ఇవ్వకుండా తీవ్రంగా ఇబ్బందులకు గురిచేసింది. కంపెనీ వేధింపులు భరించలేక తిరుపతి బయటకు వచ్చేసి, ఇతర చోట్ల పని కోసం ప్రయత్నించారు. కానీ ఎక్కడా ఉపాధి లభించలేదు. ఈ క్రమంలో కంపెనీ యజమాని తిరుపతిని పరారైన కార్మికుడిగా (ఖల్లివెల్లి) దుబాయ్ ప్రభుత్వం వద్ద నమోదు చేశారు.

ఊరికి వచ్చేసే క్రమంలో ఏప్రిల్ 12న తిరుపతి దుబాయ్ ఎయిర్‌పోర్టుకు చేరుకోగా, ఇమ్మిగ్రేషన్ అధికారులు అతనికి ఎగ్జిట్ క్లియరెన్స్ నిరాకరించి పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం ఆయన దుబాయ్ పోలీసుల నిర్బంధంలో ఉన్నారు. తన భర్తపై మోపిన ఆరోపణలను తెలుసుకుని, న్యాయ సహాయం అందించి ఇండియాకు రప్పించాలని భార్య రజిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ల పేరిట వినతిపత్రం సమర్పించారు.

**తక్షణమే స్పందించిన అధికారులు**

బాధితురాలి విజ్ఞప్తిపై సీఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి తక్షణమే స్పందించారు. దుబాయ్ తో సంప్రదింపులు జరపాలని జీఏడీ ఎన్నారై విభాగం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, లైజన్ ఆఫీసర్ భార్గవి నద్దునూరి, వాలంటీర్ ప్రీతి సువర్చల పాల్గొని బాధితురాలికి భరోసా ఇచ్చారు. గల్ఫ్ దేశాల్లో ఇరుక్కుపోయే కార్మికులకు ఉచిత న్యాయ సహాయం అందించి స్వదేశానికి తీసుకొచ్చేలా శాశ్వత యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని తెలంగాణ గల్ఫ్ అసోసియేషన్ నాయకులు మగ్గిడి తిరుపతి, పెట్టం రమేష్ డిమాండ్ చేశారు.

# ఖానాపూర్ కాంగ్రెస్‌లో కొత్త జోష్!

- జన్నారం మండల, టౌన్ అధ్యక్షుల ఖరారు
- ఉత్తర్వులు జారీ చేసిన టీపీసీసీ
- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

తెలంగాణలో అధికార పీఠాన్ని దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించింది. రాబోయే రోజుల్లో పార్టీని మరింత పటిష్టం చేసే వ్యూహంలో భాగంగా మంచిర్యాల జిల్లా ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కీలక నియామకాలు జరిగాయి. జన్నారం మండలం, జన్నారం టౌన్ కాంగ్రెస్ నూతన అధ్యక్షులను నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మంచిర్యాల డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి క్షేత్రస్థాయి సమీకరణాలను పరిశీలించి పంపిన ప్రతిపాదనలకు టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ ఆమోదం తెలిపారు.





### జన్నారం పగ్గాలు ఆ ఇద్దరికే

ఖానాపూర్ నియోజకవర్గంలో అత్యంత కీలకమైన జన్నారం ప్రాంతంలో పార్టీ శ్రేణులను నడిపించే బాధ్యతను ఇద్దరు క్రియాశీలక నాయకులకు అప్పగించారు. జన్నారం మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఎ. నందు నాయక్, జన్నారం టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా మంద రాజేష్ నియమితులయ్యారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని గాంధీ భవన్ వర్గాలు స్పష్టం చేశాయి.

### క్షేత్రస్థాయిలో శ్రమించాలి: మహేష్ కుమార్ గౌడ్

ఈ నియామక ఉత్తర్వుల్లో టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ నూతన నాయకులకు గట్టి సందేశమే ఇచ్చారు. కేవలం పదవులకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. పార్టీ నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను సద్వినియోగం చేసుకుంటూ, గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ బలాన్ని పెంచాలని సూచించారు. ప్రభుత్వ ప్రజాక్షేమ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయాలని ఆదేశించారు.

### నియోజకవర్గంలో హర్షాతిరేకాలు

చాలా రోజులుగా ఎదురుచూస్తున్న జన్నారం మండల, టౌన్ కమిటీల ప్రకటన రావడంతో ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి చొరవతో గ్రూపు రాజకీయాలకు తావులేకుండా ఈ నియామకాలు జరిగాయని స్థానిక నేతలు చర్చించుకుంటున్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన నందు నాయక్, మంద రాజేష్‌లకు నియోజకవర్గ వ్యాప్తంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.






# ఫుట్‌పాత్ ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్!

- అడ్డుగా ఉన్న బోర్డులు, ఫ్లెక్సీల తొలగింపు
- మురుగు నీటి సమస్యపై కమిషనర్ పరిశీలన
- ప్లాస్టిక్ నిబంధనలు మీరితే జరిమానాలు

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలో పాదచారులకు తీవ్ర ఇబ్బందిగా మారిన ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించేందుకు మున్సిపల్ శాఖ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కమిషనర్ అశ్రిత్ కుమార్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు రంగంలోకి దిగాయి. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు, తోపుడు బండ్లు, వాహనాల స్టాండ్లు, టీ స్టాళ్లు, ఫ్లెక్సీలను పూర్తిగా తొలగించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు మీరితే జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉండేందుకు, ప్రతి వారం మున్సిపల్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ఇలాంటి సంయుక్త ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని వెల్లడించారు.

ప్లాస్టిక్ నిషేధంపై కూడా మున్సిపల్ అధికారులు పట్టణంలోని పలు దుకాణాలు, హోటళ్లు, చికెన్ సెంటర్లలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులు విక్రయిస్తున్న వ్యాపారులకు మొత్తం రూ. 5,200 జరిమానా విధించారు. అనంతరం 16వ వార్డు రేణుకనగర్‌లో నీరు నిల్వ ఉండే సమస్యపై వచ్చిన ఫిర్యాదును కమిషనర్ అశ్రిత్ కుమార్ స్వయంగా పరిశీలించారు. ఇంటి మురుగునీరు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు, కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను గమనించారు. వెంటనే ఆ మురుగు నీటిని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే అక్కడ భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) లైన్ ఏర్పాటు చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అలాగే 2వ వార్డులో వీధిదీపాల సమస్యను పరిశీలించిన ఆయన, పట్టణంలో మంచి నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

# బసవేశ్వర జయంతోత్సవాల కరపత్రం ఆవిష్కరణ!

- సదాశివపేటలో గోడపత్రికల విడుదల
- మే 23న హైదరాబాద్‌లో ప్రజాప్రతినిధులకు సన్మానం

**సదాశివపేట, మే 16 (జనం పవర్):** సదాశివపేటలోని బసవేశ్వర మందిరంలో శ్రీ ఆది జగద్గురు ్రఖుఅ-ఎష్ట్రుఎష్ట్రుతీఖు యుగమనోత్సవము, శ్రీ మహాత్మ బసవేశ్వర జయంతోత్సవాల సందర్భంగా గోడపత్రిక, కరపత్రాన్ని ఆవిష్కరించారు. వీరశైవ లింగాయత్ సమాజం ఎడ్లబజార్ అధ్యక్షుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సమాజ అధ్యక్షుడు గందిగా రాజు మాట్లాడుతూ.. మే 23న హైదరాబాద్‌లో ఆల్ ఇండియా వీరశైవ మహాసభ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జగద్గురువుల ఆశీర్వాదం పొందాలని కోరారు. ఆల్ ఇండియా వీరశైవ మహాసభ కార్యవర్గ సభ్యుడు సుధీర్ కుమార్ పాటిల్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా నుంచి వీరశైవ లింగాయతులు పెద్దఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు అమ్మిశెట్టి జయప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా హైదరాబాద్‌లో ఆది జగద్గురు పంచాచార్య యుగమనోత్సవము, మహాత్మ బసవేశ్వర జయంతోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమాన్ని అందరూ కలిసి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిద్దికేర్ వినోద్, కోశాధికారి అమరాధి రాచన్న, జిల్లా ఉపాధ్యక్షుడు వీర మహేందర్ అడ్వకేట్, సమాజ సభ్యులు రాచప్ప, రమేష్, రవి, సురేష్, శేఖర్, సతీష్, రవణప్ప, షాబాద్ వీరన్న, విశ్వనాథ్, ప్రవీణ్, లోకేష్, మల్లేశం, వైద్యనాథ్ పాల్గొన్నారు. మహిళా సభ్యులు అన్నపూర్ణ, కవిత, పల్లవి, సంధ్యా, రమా, స్వాతి, శిరీష, లలిత హాజరయ్యారు.



# బిసి స్టడీ సర్కిల్‌లో 'ఏఐ' శిక్షణ!

### ఉచిత లైఫ్ స్కిల్స్ వర్క్‌షాప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

### సంగారెడ్డి, మెదక్ జిల్లాల అభ్యర్థులకు అవకాశం

**సంగారెడ్డి, మే 16 (జనం పవర్):** తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని బిసి స్టడీ సర్కిల్ సంగారెడ్డి ద్వారా "ఏఐ, లైఫ్ స్కిల్స్" పై నాలుగు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. జగదీష్ తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ఈ వర్క్‌షాప్ మే 21 నుంచి 26 వరకు బిసి స్టడీ సర్కిల్‌లో జరగనుంది. విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాథమిక అంశాలు, వివిధ అప్లికేషన్లపై అవగాహన కల్పించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జీవనోపాధి కోసం సమర్థవంతంగా వినియోగించుకునేలా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు మే 18 నుంచి 20వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జగదీష్ తెలిపారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని వెలుగు ఆఫీస్ క్యాంపస్‌లో గల బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో కార్యాలయ వేళల్లో నేరుగా వెళ్లి తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఈ శిక్షణకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 08455-277015, 9494390803 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

# ఇంధన ధరల పెంపును ఉపసంహరించుకోవాలి!

### ధరల పెరుగుదలతో సామాన్యులపై తీవ్ర భారం

### కేంద్రం నిర్ణయంపై దేవులపల్లి యాదగిరి ఆగ్రహం




**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచడంపై దేవులపల్లి యాదగిరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నంగునూర్ లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇరాన్‌ఉఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపుతూ ఇంధన ధరలను అడ్డగోలుగా పెంచడం సామాన్యుల నడ్డి విరిచే చర్య అని విమర్శించారు. ఆత్మనిర్భర్ భారత్ అనేది కేవలం ఓట్ల కోసం వినిపించే నినాదమే తప్ప, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని ఎద్దేవా చేశారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని యాదగిరి ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి సామాన్య ప్రజలు బతుకలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని, యువతకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని విమర్శించారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీ ఎక్కడా అమలు కాలేదని ఆరోపించారు. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూనే ఉందని పేర్కొన్నారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, ఇంధన ధరల పెంపును ఎలా సమర్థించుకుంటుందని యాదగిరి ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ఎన్నికల ముందు ధరలు పెంచబోమని ప్రకటించి, ఫలితాలు వచ్చిన కొద్ది రోజులకే భారం మోపడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్య అని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలమకుల ప్యాక్స్ డైరెక్టర్ గంగుల రవి, ఆరెపల్లి సురేష్, సందెబోయిన తిరుపతి, కుసుంభ రాజేశం, పంగ రాజశేఖర్ రెడ్డి, బాల్ రెడ్డి పాల్గొన్నారు.

# జూన్ 2 నాటికి పనులు పూర్తి చేయాలి!

### అధికారులకు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ఆదేశం

### పాఠశాలల పునఃప్రారంభం లోపే మరమ్మతులు కావాలి

### నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

**నారాయణపేట, మే 16:** నారాయణపేట జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించి, జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో వివిధ నిధులతో కొనసాగుతున్న పలు ఇంజనీరింగ్ పనులపై శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు, ఈఈలు, డీఈలు, సహాయ ఇంజనీర్లతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష జరిపారు.

### వైద్య కళాశాల పనులపై ఆరా

ముందుగా జిల్లా కేంద్రానికి సంబంధించి మెడికల్ కళాశాల, మాతా శిశు సంరక్షణ కేంద్రం, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాల వద్ద ఒక్క బోరు కూడా పడకపోవడంపై కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. ప్రైవేటు బోరు నుంచి నీటిని వాడుకుంటున్నామని అధికారులు సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ భవన నిర్మాణాల వద్ద తప్పకుండా నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. జిల్లా ఆసుపత్రిలో జనరేటర్ ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

### విద్యా సంస్థల్లో వేసవిలోనే పనులు

కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులతో పాటు పీఎం శ్రీ స్కూల్స్ లో సైన్స్ ల్యాబ్స్ నిర్మాణాలను పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మక్తల్ లోని వంద పడకల ఆసుపత్రి అకాడమిక్ బ్లాక్ పనుల్లో వేగం పెంచాలన్నారు. విద్యా సంస్థల్లో ఏవైనా మరమ్మతులు ఉంటే వేసవి సెలవులు ముగిసేలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమీకృత చేనేత భవనం, మహిళా సమాఖ్య భవనాలను జూన్ 2 లోపు ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు.

### మిషన్ భగీరథ నీటి సరఫరాపై సమీక్ష

మక్తల్ పట్టణంలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు ప్రత్యామ్నాయంగా సంగంబండ రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరాకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మన్యంకొండ నుంచి జిల్లాకు రోజుకు ఎన్ని లీటర్ల నీటి సరఫరా జరుగుతుందో నివేదిక ఇవ్వాలని మిషన్ భగీరథ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల పనులు, కలెక్టరేట్ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు.

### నివేదికలతో రావాల్సిందే

ఇంజనీరింగ్ అధికారులతో ఇది తనకు తొలి సమావేశమని, వచ్చే సమావేశానికి సహాయ ఇంజనీర్లు తాము పూర్తి చేసిన పనుల నివేదికలతో రావాలని స్పష్టం చేశారు. ఇతర జిల్లాల ఇన్‌ఛార్జ్ బాధ్యతలు ఉన్నాయనే కారణాలు చెప్పవద్దని, వారంలో కచ్చితంగా గురు, శుక్ర, శనివారాల్లో ఈ జిల్లాలోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పనుల్లో విధిగా ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు వేణుగోపాల్, అశోక్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# గోనెసంచుల కోసం రైతుల రాస్తారోకో!

**కంది సహకార కేంద్రం ఎదుట ధర్నా**

**సంచుల కొరతతో రైతుల ఆవేదన**



**కంది, మే 16 (జనం పవర్):** గోనెసంచుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు శనివారం కంది ప్రాథమిక సహకార కేంద్రం ఎదుట ధర్నాకు దిగారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలుగా ఉన్నప్పటికీ గోనెసంచులు అందుబాటులో లేకపోవడంతో, వాటిని నింపలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు కేంద్రం ముందు రాస్తారోకో నిర్వహించి అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వెంటనే తగిన సంఖ్యలో గోనెసంచులు పంపిణీ చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే గోనెసంచులు అందజేస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. అధికారుల భరోసాతో రైతులు తమ ఆందోళనను విరమించారు.

# ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు!

**సైన్స్ కేంద్రంలో ఆర్ట్, క్రాఫ్ట్ ప్రదర్శన**

**విజేతలకు బహుమతులు ఇచ్చిన డీఈవో**




**సంగారెడ్డి, మే 16 (జనం పవర్):** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసేందుకే వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా సైన్స్ కేంద్రంలో ఆర్ట్, క్రాఫ్ట్, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. విద్యార్థుల కళాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని డీఈవో పేర్కొన్నారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేసి అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.

# ఆపరేషన్‌లో నిర్లక్ష్యం

## కడుపులో దూది మరచిన వైద్యులు!

**సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన**

**నెల రోజుల తర్వాత బయటపడ్డ నిర్లక్ష్యపు వైనం**






పేషంటు నందిని భర్త

- **బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం డిమాండ్**



పేషంటు తల్లి స్వరూప

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వెలుగుచూసిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. బాధితుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేట మండలం సుతార్‌పల్లికి చెందిన నందిని అనే మహిళ గత నెల ఏప్రిల్ 14న కాన్పు కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. వైద్యులు ఆమెకు ఆపరేషన్ నిర్వహించారు. అనంతరం తీవ్ర రక్తస్రావం జరుగుతుండటంతో డాక్టర్ సింధూరి కాటన్ పెట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### నెల రోజుల పాటు శరీరంలోనే కాటన్

అయితే ఆ కాటన్‌ను తిరిగి తొలగించాల్సి ఉంటుందనే విషయాన్ని బాధితురాలికి గానీ, కుటుంబ సభ్యులకు గానీ వైద్యులు చెప్పలేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో నెల రోజుల పాటు కాటన్ ఆమె శరీరంలోనే ఉండిపోయి తీవ్ర ఇన్ఫెక్షన్‌కు దారితీసింది. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణించడంతో నందినిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అసలు విషయం బయటపడింది. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఇన్ఫెక్షన్ సోకిందని ప్రైవేటు వైద్యులు స్పష్టం చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

### ఆసుపత్రి సిబ్బంది దురుసు ప్రవర్తన

ఈ విషయమై నందిని కుటుంబ సభ్యులు, బంధువులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని వైద్యుల తీరుపై పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తన కుమార్తెకు అధిక రక్తస్రావం కావడంపై డాక్టర్‌ను ప్రశ్నిస్తే తమతో దురుసుగా ప్రవర్తించారని బాధితురాలి తల్లి స్వరూప ఆరోపించారు. అక్కడే ఉన్న నందిని భర్తపై కూడా ఆసుపత్రి సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారని వాపోయారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం డిమాండ్ చేస్తోంది.

# గిరిజన పాఠశాలల్లో విద్యా వారోత్సవాలు!

- **వంద శాతం ప్రవేశాలే లక్ష్యంగా ప్రణాళిక**
- **గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు పిలుపు**




**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా నాయకపు గూడ ఇంధనపల్లి, కొమ్ముగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో విద్యా వారోత్సవాల సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జన్నారం ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శివరాజం, ఎస్సీఆర్పీ రఘునాథం హాజరయ్యారు.

### బడి బయట పిల్లలు ఉండొద్దు

ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శివరాజం మాట్లాడుతూ.. మే 11 నుంచి మే 17 వరకు విద్యా వారోత్సవాలు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రతి నివాస ప్రాంతంలో బడి ఈడు పిల్లలను గుర్తించి, వారంతా కచ్చితంగా పాఠశాలలో చేరేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బడి బయట ఏ ఒక్క పిల్లవాడు ఉండకూడదని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన పిల్లలను తల్లిదండ్రుల ఇష్టానుసారం నచ్చిన పాఠశాలలో చేర్పించాలని సూచించారు. గ్రామంలో వంద శాతం ప్రవేశాలు సాధిస్తూ, బడి మానేసే వారి సంఖ్యను సున్నాకు తగ్గించాలని పిలుపునిచ్చారు.

### ఎండలపై నిఘా.. పుస్తకాలపై ఆసక్తి

ప్రస్తుత వేసవి కాలంలో విద్యార్థులు ఎండలో తిరగకుండా, వడదెబ్బ తగలకుండా చూసుకోవాల్సిన బాధ్యత పూర్తిగా తల్లిదండ్రులదేనని శివరాజం పేర్కొన్నారు. పిల్లలు నీడపట్టున ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా ప్రతి గ్రామ సర్పంచ్ చొరవ చూపాలని కోరారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఒక ప్రత్యేక గదిని కేటాయించి, అందులో నీతి కథల పుస్తకాలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలను అందుబాటులో ఉంచాలన్నారు. దీనివల్ల పిల్లల్లో చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వెళ్లడం, పుస్తకాలు చదవడం వంటి మంచి అలవాట్లు పెంపొందుతాయని, ఉత్సాహంగా జ్ఞానాన్ని ఆర్జిస్తారని తెలిపారు. ఈ ప్రత్యేక సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. బిక్కు, స్థానిక వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# కవ్వాల్‌లో తాగునీటి కష్టాలకు చెక్!

**యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ల పనులు**

## ఇంటింటికీ కొత్త నీటి కనెక్షన్లు.. సర్పంచ్, కార్యదర్శి క్షేత్రస్థాయి పరిశీలన

**తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

జన్నారం మండలంలోని కవ్వాల్ గ్రామంలో వేసవి తాగునీటి ఎద్దడి రాకుండా పంచాయతీ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. పాత సమస్యలను చక్కదిద్దడంతో పాటు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారాల వైపు అడుగులు వేస్తోంది. గ్రామంలో కేవలం లీకేజీల మరమ్మతులకే పరిమితం కాకుండా నీటి సౌకర్యం లేని ప్రాంతాలపై పంచాయతీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటివరకు కనెక్షన్ లేని ఇళ్లను గుర్తించి నూతన పైప్‌లైన్ల ద్వారా కొత్త కనెక్షన్లను మంజూరు చేస్తున్నారు. కొన్ని వార్డుల్లో ఇప్పటివరకు అసలు తాగునీటి సరఫరా లైన్లే లేవు. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన పంచాయతీ ఆయా వార్డులలో పూర్తిగా కొత్తగా మెయిన్ లైన్ పనులను ప్రారంభించింది. భూగర్భంలో కొత్త పైపులను అమర్చుతూ ప్రతి ఇంటికీ నీరు అందేలా రూట్ మ్యాప్ సిద్ధం చేసి పనులు పూర్తి చేస్తున్నారు.

### క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణ

గ్రామ వీధుల్లో జరుగుతున్న ఈ పైప్‌లైన్ పనులను సర్పంచ్ సక్రు, పంచాయతీ కార్యదర్శి విశ్వ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. జనాభా అవసరాలకు తగ్గట్టుగా పైపుల నాణ్యత ఉండేలా చూస్తున్నారు. దీనికి తోడు గ్రామంలో ఎక్కడైనా లీకేజీలు ఉంటే వాటిని అరికట్టేందుకు కార్మికులతో తక్షణమే రిపేర్లు చేయిస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న చేతిపంపులను సైతం బాగు చేయించి ప్రత్యామ్నాయంగా అందుబాటులోకి తెచ్చారు.





### నీటిని పొదుపుగా వాడుకోవాలి

ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి విశ్వ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా గ్రామస్తులకు తాగునీటి కొరత రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న మిషన్ భగీరథ నీటిని ప్రజలు అత్యంత పొదుపుగా, కేవలం నిత్యావసరాలకే వాడుకోవాలని కోరారు. సరికొత్తగా లైన్ కనెక్షన్లు వేస్తూ దశాబ్దాల నీటి కష్టాలను తీరుస్తున్న పంచాయతీ యంత్రాంగం తీరుపై కవ్వాల్ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

